సాక్షి
నల్లగొండ

ఆదివారం ၊ 19 ၊ మార్చి ၊ 2023



అలరించిన నాటక పోటీలు

మిర్యాలగూడలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాట పోటీలు శనివారం తొమ్మిదో రోజు అలరించాయి. - 10లో



నృసింహుడికి లక్షపుష్పార్చన

యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
35°/22°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కరిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 476 మంది గైర్హాజరు



మిర్యాలగూడలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు శనివారం జిల్లా వ్యాప్తంగా 476 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 14,935 పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 14,459 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని ప్రశాంతంగా పరీక్ష జరిగిందని పేర్కొన్నారు. మిర్యాలగూడలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పరిశీలించారని తెలిపారు.

హరితహారంపై నిర్లక్ష్యం తగదు



కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

త్రిపురారం : హరితహారంపై నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచి నాటే ఏర్పాట్లు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని నర్సరీ, నాడెపు కంపోస్టు ఎరువల తయారీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకుంటూ గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, ఏపీఓ సూరానాయక్, ఎంపీఓ భిక్షంరాజ్, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ముగిసిన రాజీవ్ స్వగృహ వేలం



కలెక్టరేట్‌లో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నల్లగొండ : రాజీవ్ స్వగృహ శ్రీవల్లీ టౌన్‌షిప్‌లో ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న వేలం పాట శనివారం ముగిసింది. మొదటిరోజు 23 ఓపెన్ ప్లాట్లు, మూడు పాక్షిక నిర్మాణ గృహాలు, రెండో రోజు 38 ఓపెన్ ప్లాట్లు, 3 పాక్షిక నిర్మాణ గృహాలు, మూడో రోజు 10 ఓపెన్ ప్లాట్లు, 27 పాక్షిక నిర్మాణ గృహాలను బహిరంగ వేలంలో పాల్గొన్న బిడ్డర్లు కొనుగోలు చేశారు. 4వ విడత వేలంలో మొత్తం 133 ఓపెన్ ప్లాట్లు, 253 పాక్షిక నిర్మాణ గృహాలను అమ్మకానికి ఉంచగా.. మొత్తం 71 ఓపెన్‌ప్లాట్లు, 33 పాక్షిక నిర్మాణ గృహాలు అమ్ముడుపోయాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి 9కోట్ల 25లక్షల 51వేల రూపాయల ఆదాయం సమకూరింది.

నిరంతరం వాహనాల తనిఖీ

- ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా నిరంతరం వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ఎస్పీ అపూర్వరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 10,287 వాహనాలపైన కేసులు నమోదు చేసి.. రూ.4,33,660 జరిమానా విధించామని, మద్యం తాగి వాహనాలు నడిపిన 929 మందిని కోర్టులో హాజరు పర్చగా 15 మందికి జైలు శిక్ష పడిందని వెల్లడించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బుల్లెట్ వాహనాల వెంట వచ్చిన సైలెన్సర్ కాకుండా ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లు ఉపయోగిస్తే.. రూ.5 వేల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. కాలం చెల్లిన వాహనాలతోపాటు, పొగ ఎక్కువగా వచ్చే వాహనాలపై కూడా జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు.

ఆపరేషన్లు బంద్!

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో మరమ్మతులు

- 20 రోజులుగా ఆపరేషన్ థియేటర్లు మూసివేత
- రోగులు, గర్భిణులను నల్లగొండకు రెఫర్ చేస్తున్న వైద్యులు
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో సాగుతున్న అభివృద్ధి పనులు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇప్పుడు ఆపరేషన్లు పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో మరమ్మతుల పేరుతో ఫిబ్రవరి 25న ఆపరేషన్ థియేటర్లు మూసివేశారు. 20 రోజులవుతున్నా.. పనులు పూర్తి కాలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, కంటి ఆపరేషన్ల కోసం మొత్తం నాలుగు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వాటిలో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయించడంలో వైద్యులుతో పాటు సూపరింటెండెంట్ విఫలమయ్యారని రోగులు అంటున్నారు. వీరి అసత్వం కారణంగా కాంట్రాక్టర్ పనులు నత్తనడకన చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నల్లగొండకు రెఫర్ చేస్తూ వైద్యులు...

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి రోజూ 150 మందికిపైగా గర్భిణులు వైద్య పరీక్షల కోసం వస్తుంటారు. వీరిలో రోజూ 10 మందికి పైగా కాన్పులు చేస్తుంటారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో వస్తున్న గర్భిణులను నల్లగొండకు తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇక్కడి వచ్చే గర్భిణులు నల్లగొండ వెళ్లేందుకు ఇబ్బంది పడి స్థానికంగానే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గతంలో కంటే ఈ నెలలో మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది.

వారం రోజుల్లో పూర్తి చేసేలా చూస్తాం



"20 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి కావడంతో ఆపరేషన్ థియేటర్లను ఆధునీకీకరించేందుకు పనులు ప్రారంభించాం. అనుకున్న దానికంటే కొంత ఆలస్యమైంది. వారంరోజుల్లో పనులు పూర్తి చేసి ఆపరేషన్ థియేటర్లను అందుబాటులోకి తెచ్చేలా చూస్తాం. రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటాం.

– మాతృనాయక్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి

ఖాళీగా దర్శనమిస్తున్న కాన్పుల వార్డు

ఏరియా ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం నలుగురు గైనకాలజిస్టులను నియమించింది. నాలుగు ఆపరేషన్ థియేటర్లలో కాన్పుల కోసం నెలకు వందకు పైగా సిజేరియన్లు చేస్తున్నారు. అయితే 20 రోజులుగా కాన్పులు లేకపోవడంతో ప్రసూతి వార్డు ఖాళీగా దర్శనమిస్తోంది. దీంతోపాటు రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో అత్యవసర చికిత్సలు, ఆర్థోపెడిక్ విభాగ వైద్యులు చేసే ఆపరేషన్లు సైతం నిలిచిపోయాయి. ఆస్పత్రిలో మరమ్మతుల కారణంగా ఆపరేషన్ థియేటర్లు మూసివేయడంతో ఆస్పత్రిలో సిబ్బంది ఖాళీగా కూర్చుని కాలక్షేపం చేస్తున్నారు. ఓపీ సేవలు మాత్రం నడుస్తుండగా ఆయా పనులు చూసుకుని డ్యూటీ అయిపోగానే వెళ్లిపోతున్నారు.



ఖాళీగా ఉన్న ప్రసూతి వార్డు

‘అసమర్థ ప్రభుత్వం దిగిపోవాలి’

నల్లగొండ టూటౌన్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థతే కారణమని, నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం దిగిపోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన పోరాడుతుంటే అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, దాసోజు యాదగిరాచారి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, బొజ్జ నాగరాజు, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, ఐతరాజు సిద్ధూ, పాలకూరి రవిగౌడ్, చర్లపల్లి గణేష్, సాయి, నీరజ, దేవి, హైమావతి, తార తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


సీఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి

కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న యువతి చేయి పట్టుకున్న శాలిగౌరారం సీఐ రాఘవరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి.. ఆ పార్టీ నాయకులతో శనివారం ఎస్పీ అపూర్వరావుకు వినతి పత్రం అందజేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపడితే సీఐ యువతి చేయి పట్టుకొని లాక్కువెళ్లడం సరైంది కాదని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై మహిళా కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు గడువు పెంపు

నల్లగొండ టూటౌన్ : సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిరావుపూలే, ప్రభుత్వ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ప్రాంతీయ సమన్వయ అధికారి అరుణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు www.tswseis.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉంటుందని తెలిపారు.

నిమ్మతోట నేలమట్టం



ఈదురుగాలులు, వడగళ్ల వాన దాటికి కనగల్ మండలం మంచినీళ్లబావి గ్రామంలో కూలిన నిమ్మచెట్లు

కామారెడ్డి కేంద్రంగా నకిలీ రేషన్ ఐడీ కార్డులు

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలో వెలుగు చూసిన నకిలీ రేషన్ కార్డుల వ్యవహారం కామారెడ్డి జిల్లా నుంచి జరిగినట్లుగా తేలింది. అక్కడి ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు ఈ మండలంలో రేషన్ డీలర్లకు ఫోన్ చేసి ఆర్డరు తీసుకుని కొరియర్ ద్వారా కార్డులు అందించాడు. ఐడీ కార్డుల వ్యవహారం వెలుగులోకి రావడంతో విక్రయించిన కార్డులను కూడా తిరిగి వాపసు తీసుకున్నట్లు తెలిసింది. ఒకరిద్దరు డీలర్లు రెవెన్యూ అధికారులకు ఆ కార్డులను అప్పగిస్తూ జాగ్రత్త పడుతున్నారు. మూడు రోజులుగా సివిల్ సప్లయీస్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో జరిపిన విచారణ ఆధారంగా తహసీల్దార్ నివేదిక సిద్ధం చేసి ఆర్డీఓకు పంపించారు. 9 గ్రామాల్లో 1,500 కార్డుల వరకు లెక్క తేలినట్లుగా తెలుస్తోంది. నివేదిక ఆధారంగా ఆరుగురు డీలర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. నకిలీ ఐడీ కార్డుల వ్యవహారం జిల్లాలో ఇంకా ఎక్కడైనా జరిగిందా అనే విషయమై పౌరసరఫరాల శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు.

ఉపాధి హామీ పనుల్లో అలసత్వం వద్దు



నర్సరీని పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

వేములపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అలసత్వం వహించొద్దని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఉపాధి హామీ పనులపై ఆరా తీశారు. అనంతరం సమీపంలోని నర్సరీని, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించి మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి వంద పని దినాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ అజ్మీరా దేవిక, సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, ఎంపీఓ సంగీత, కార్యదర్శి శ్రవణ్, ఏఈఓ నితిన్ పాల్గొన్నారు.

ఆయకట్టులో ఉపాధి పనులు గుర్తించాలి

మిర్యాలగూడ : సాగర్ ఆయకట్టు ప్రాంతంలో కూలీలకు ఉపాధి కల్పించే విధంగా పనులు గుర్తించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ నుంచి ఇప్పటివరకు పనులు జరగడం లేదని, కూలీలకు పనులు కల్పించే విధంగా చూడాలన్నారు. కాల్వ పనులను మినహాయించి గ్రామాల్లో ఏయే పనులను చేయవచ్చో గుర్తించి వెంటనే కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఏపీఓలు శిరీష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులకు ఊరట

- క్యాడర్ల కేటాయింపు, పే స్కేల్ వర్తింపజేస్తూ జీఓ విడుదల
- జిల్లాలో 170 మంది ఉద్యోగులకు మేలు
- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే అందనున్న వేతనాలు
- ఏప్రిల్ 1 నుంచే అమలు



డీఆర్‌డీఓ కార్యాలయం

నల్లగొండ : డీఆర్‌డీఓలో 21 సంవత్సరాలుగా పనిచేస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు ఊరట లభించింది. ప్రభుత్వం సుదీర్ఘకాలం తర్వాత వారి వినతిని మన్నించి ఉద్యోగులకు క్యాడర్ కేటాయించడంతోపాటు పే స్కేల్ వర్తింజేస్తూ జీఓ ఎంఎస్ 11ను విడుదల చేసింది. దీంతో ఇన్నాళ్లుగా హెచ్‌ఆర్ పద్ధతిలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు మేలు జరగనుంది.

21 ఏళ్ల కింద భర్తీ..

కేంద్ర ప్రభుత్వం పథకమైన డీఆర్‌డీఓలో సెర్ప్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అందులో పని చేసేందుకు 2002, 2003లో ఉద్యోగులను భర్తీ చేసింది. వారందరినీ హెచ్‌ఆర్ పాలసీ కింద తీసుకుంది. అంటే అన్ని శాఖల్లో సంవత్సరానికోసారి కాంట్రాక్టు ఉద్యోగులను రెన్యువల్ చేస్తూ వస్తుండగా ఈ శాఖలో మాత్రం ఐదేళ్లకు ఒకసారి ఉద్యోగులను రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. వీరిలో కొందరు జిల్లా స్థాయి పోస్టుల్లో పని చేస్తుండగా మరికొందరు వివిధ స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్నారు. కానీ వారికి ఇప్పటి వరకు ఎలాంటి క్యాడర్‌గానీ, పేస్కేల్‌గానీ అమలు చేయడం లేదు. కాంట్రాక్టు పద్ధతిన కొంత వేతనం ఇస్తూ వస్తున్నారు. సెర్ప్ ఉద్యోగులంతా కొంత కాలంగా తమకు క్యాడర్ కేటాయించడంతోపాటు పేస్కేల్ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సెర్ప్ ఉద్యోగులకు క్యాడర్ కేటాయిస్తామని అసెంబ్లీలో ప్రకటించింది. అందులో భాగంగానే క్యాడర్ కేటాయింపు, పేస్కేల్ వర్తింపజేసేందుకు జీఓను విడుదల చేసింది.

170 మంది ఉద్యోగులకు మేలు..

జిల్లాలో సెర్ప్‌లో వివిధ స్థాయిల్లో 170 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వీరికి ఎంతో మేలు జరగనుంది. ఇప్పటివరకు పే స్కేల్ లేకపోవడంతోపాటు వారు ఏ క్యాడర్‌లో పని చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం క్యాడర్ ఫిక్స్ కావడం వల్ల వారికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే పేస్కేల్ వర్తించడంతోపాటు వేతనాలు కూడా పొందనున్నారు. అయితే ఈ జీఓ ఏప్రిల్ 1 నుంచే అమలు కానుంది.

డీపీఎంల అసంతృప్తి...

సెర్ప్ ఉద్యోగుల క్యాడర్ వర్తింపు విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో డీపీఎంలు అసంతృప్తితో ఉన్నారు. ప్రస్తుతం డీపీఎంలుగా జిల్లాస్థాయి పోస్టుల్లో పనిచేస్తుండగా వారిని సూపరింటెండెంట్లుగా క్యాడర్ వర్తింపజేయడంతో వారు కిందిస్థాయి పోస్టుకు సమానం కావడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

క్యాడర్ల కేటాయింపు ఇలా..

కేటగిరి	ఉద్యోగుల సంఖ్య	క్యాడర్	పేస్కేల్ (రూ.లలో)
ప్రాజెక్టు మేనేజర్	1	ఎంపీడీఓ	51,320 - 1,27,310
డీపీఎంలు	4	సూపరింటెండెంట్	42,300 - 1,15,270
ఏపీఎంలు	38	సీ.అసిస్టెంట్	32,810 - 96,890
సీసీలు	112	జూ.అసిస్టెంట్	24,880 - 72,850
ఎంఎస్‌సీసీలు	7	సబార్డినేట్	19,000 - 58,850
కంప్యూటర్ ఆపరేటర్లు	8	జూ.అసిస్టెంట్	24,880 - 72,850

వినయ్.. అమర్ రహే..

- మల్కాజ్‌గిరి నుంచి బొమ్మలరామారం వరకు అంతిమయాత్ర
- జాతీయపతాకాలు, వినయ్ చిత్రపటంతో యువత బైక్ ర్యాలీ
- వ్యవసాయక్షేత్రంలో ముగిసిన అంత్యక్రియలు
- పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

అశ్రునయనాలతో వినయ్ భానురెడ్డికి అంతిమ వీడ్కోలు



లెఫ్టినెంట్ కల్నల్ వినయ్‌భానురెడ్డి పార్థివదేహాన్ని బొమ్మలరామారం తీసుకొస్తున్న గ్రామస్తులు

బొమ్మలరామారం : అరుణాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 16న చీతా హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో అసువులు బాసిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి అంత్యక్రియలు శనివారం బొమ్మలరామారం మండల కేంద్రంలో జరిగాయి. ఉదయం హైదరాబాద్‌లోని మల్కాజిగిరి నుంచి వినయ్ భౌతిక కాయాన్ని ఆర్మీ అధికారులు ప్రత్యేక సైనిక వాహనంలో బొమ్మలరామారానికి తీసుకువచ్చారు. అంతిమయాత్ర ఉద్విగ్నంగా సాగింది. వినయ్ భౌతికకాయం ఉన్న వాహనం ఉదయం 11.35 గంటలకు బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్ చెక్‌పోస్ట్ వద్దకు చేరుకుంది. వినయ్‌భానురెడ్డి పార్థివదేహానికి పూలు చల్లుతూ యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్‌లపై జాతీయ జెండాలు, వినయ్ భానురెడ్డి చిత్రం పటంతో ఉన్న ఫ్లెక్సీలను ప్రదర్శించారు. వినయ్ భానురెడ్డి అమర్ రహే.. అంటూ నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. సైనిక వాహనం రంగాపూర్ గ్రామం మీదుగా మండల కేంద్రంలోని గుడిబావి చౌరస్తా నుంచి 12.23 గంటలకు గ్రామంలోని వినయ్ భానురెడ్డి స్వగృహానికి వచ్చింది. సైనిక అధికారులు వినయ్ పార్థివదేహం పేటికను ఆయన స్వగృహానికి మోసుకు వచ్చారు. అక్కడ సుమారు అరగంటపాటు గ్రామస్తుల సందర్శనార్థం ఉంచారు. బంధువులు, ప్రజలు భారీగా వచ్చి నివాళులర్పించారు. అక్కడి నుంచి తిరిగి 12.58 గంటలకు సైనిక సంప్రదాయ బ్యాండ్‌తో అంతిమ యాత్ర ప్రారంభించారు. అంతిమయాత్రలో మంత్రి జగదీష్‌రెడ్డితో పాటు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో భూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రాచకొండ సీపీ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. 1.41 గంటలకు అంతిమయాత్ర వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంది. వినయ్ భానురెడ్డి భౌతికకాయం పేటికపై ఉంచిన జాతీయ జెండాను, ఆయన సైనిక దుస్తులను ఆర్మీ అధికారులు వినయ్ భార్య స్పందనారెడ్డికి అందజేశారు. సైనిక లాంఛనాల ప్రకారం మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపాక మధ్యాహ్నం 2.10 గంటలకు హిందూ సంప్రదాయం ప్రకారం వినయ్‌భానురెడ్డి పెద్ద కూతురు అనికతో తండ్రి నర్సింహారెడ్డి వినయ్ చితికి నిప్పంటించి అంత్యక్రియలను పూర్తి చేశారు.



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న వినయ్ తండ్రి నర్సింహారెడ్డి



సంతాప సూచకంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న ఆర్మీ జవాన్లు

చిన్నారులను చూసి కంటతడి పెట్టిన గ్రామస్తులు

వినయ్ భానురెడ్డి అంత్యక్రియలలో ఆయన కూతుళ్లు అనిక, ఆర్నిక బిక్కచూపులు చూస్తుంటే అక్కడున్నవారు కంటతడిపెట్టారు. వేల మందిలో మా నాన్న ఎక్కడ ఉన్నాడు అని వెతుకుతూ తల్లి స్పందనారెడ్డిని అడుగుతున్నట్లుగా ఆ చిన్నారుల అమాయక చూపులు పలువురిని కంటతడిపెట్టించాయి. చిన్న కుమార్తె ఆర్నిక వినయ్ భానురెడ్డి పార్థివదేహం గల పేటిక వద్దకు వెళ్లి నాన్న లే అన్నట్లుగా పేటికను తట్టినప్పుడు మహిళలు రోదించారు. అనిక తన తాత నర్సింహారెడ్డితో కలిసి తండ్రి చితికి నిప్పుపెడుతుండగా ఆ దృశ్యాన్ని చూసి పలువురు అధికారులు సైతం కంటతడి పెట్టారు. వినయ్ భానురెడ్డి భార్య స్పందనారెడ్డి హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి నుంచి బయలుదేరినప్పటి నుంచి స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు తన భర్త వినయ్ భానురెడ్డి చిత్ర పటాన్ని తన వెన్నంటే పెట్టుకొని మౌనంగా రోదించించారు.



వినయ్ పార్థివదేహం పేటికపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



వినయ్ సైనిక దుస్తులను ఆయన భార్యకు అందజేస్తున్న ఆర్మీ అధికారులు

క్లుప్తంగా

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని అంగడి బజార్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం రావులపాలెం గ్రామానికి చెందిన చింతకుంట్ల వేణు(40)కు యాదగిరిగుట్టకు చెందిన నవిత అనే మహిళతో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వేణు వృత్తిపరంగా హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ రోజూ యాదగిరిగుట్టకు వచ్చి వెళ్తున్నాడు. భార్యభర్తల నడుమ ఏడాది కాలంగా కుటుంబ కలహాలు నెలకొని గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం నవిత ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ వెళ్లి భర్తకు దూరంగా ఉంటోంది. దీంతో ఒంటరి జీవితాన్ని జీర్ణించుకోలేని వేణు శనివారం అంగడి బజార్‌లో ప్రస్తుతం ఉంటున్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రావు వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థికసాయం



బాధిత కుటుంబాలకు నగదు అందజేస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్: మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో గల ఇండస్ట్రీయల్ పార్కులో గతనెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన, గాయపడిన దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రకటించిన రూ.10లక్షల ఆర్థికసాయాన్ని శనివారం ఆ గ్రామ బీజేపీ నాయకులు అందజేశారు. మృతిచెందిన డాకోజి నాగలక్ష్మీ, వరకాంతం అనసూయ, సిలివేరు ధనమ్మ, దేవరపల్లి శిరీష కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున, గాయపడిన కొండ వెంకటేశం, కావ్య, అఖిల, యమునలకు 50వేల రూపాయల చొప్పున గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు సుర్గు రాజమ్మ, ఆదిమహావిష్ణువు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, మాజీ సర్పంచ్ వర్కాల మహేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సుర్గు శ్రీనివాస్, గట్టు సుధాకర్, అత్తాపురం వెంకట్‌రెడ్డి, పులిగిళ్ల శ్రీనివాస్‌చారి, సుర్కంటి మోహన్‌రెడ్డి, జంగారెడ్డి, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

గాలివాన, వడగండ్లు

పలు మండలాల్లో భారీ వర్షం
- రహదారులపై కూలిన చెట్లు, విరిగిన స్తంభాలు
- స్తంభించిన ట్రాఫిక్
- నిలిచిన విద్యుత్ సరఫరా

భువనగిరి, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, ఆత్మకూర్(ఎం), వలిగొండ : జిల్లాలోని పలు మండలాల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. భువనగిరి పట్టణంతో మండలంలో సుమారు 20 నిమిషాల పాటు వడగండ్ల వాన పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోకి వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి, డ్రెయినేజీలు పొంగిపొర్లాయి.

భూదాన్‌పోచంపల్లిలో..
మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. జలాల్‌పురంలో తేలికపాటి వడగండ్లు పడ్డాయి. ఉదయం నుంచి ఆకాశం మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.



ఆత్మకూర్ (ఎం)లో కురిసిన వడగండ్లు

యాదగిరిగుట్టలో..
పట్టణంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది, రోడ్లపై వర్షపు నీరు పొంగిపొర్లింది. ఒక్కసారిగా వర్షం రావడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అదే విధంగా మోటకొండూరు, ఆత్మకూర్(ఎం) మండలాల్లోనూ వడగండ్లు పడ్డాయి. నష్టం వివరాలు ఆదివారం తెలియనున్నాయి.

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది. పొట్ట దశకు చేరుకున్న వరి చేలపై వడగండ్లు కురవడంతో వడ్లు రాలిపోయి నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు.

వలిగొండలో..
మండలంలోని పులిగిల్ల, మొగిలిపాక, పహిల్వాన్‌పురం, రెడ్లరేపాకలో ఈదురుగాలు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. రెడ్లరేపాకలో ఈదురు గాలులకు చెట్టు కూలి మూడు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఇదే గ్రామంలో విద్యుత్ వైర్ తెగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



రెడ్లరేపాకలో ఈదురుగాలులకు చెట్టు కూలి ధ్వంసమైన బైకులు

తిరుమలగిరిలో..



తిరుమలగిరిలో కురిసిన వడగండ్లు

తిరుమలగిరి: తిరుమలగిరి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి రాత్రి 7 గంటల నుంచి 8గంటల వరకు వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో కూడిన 100 గ్రాముల బరువు గల వడగండ్లు పడడంతో ప్రజలంతా భయభ్రాంతులకు గురయ్యారు. పెంకుటిళ్లులన్నీ దెబ్బతిన్నాయి. భారీ ఈదురు గాలులకు తిరుమలగిరి–తొర్రూర్ రోడ్డుపై భారీ వృక్షాలు నేలకూలాయి. తొర్రూర్ రోడ్డు వైపు ఉన్న ఒక దాబా వద్ద కారుపై భారీ వృక్షం కూలింది. ఇదే రోడ్డులో తొండ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు రోడ్లపై పడ్డాయి. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నెల్లిబండతండాలో గోడ కూలి 20 గొర్రెలు మృతి చెందాయి. జనగాం –సూర్యాపేట ప్రధాన రహదారిపై హోర్డింగ్ కూలడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అధికారులు వచ్చి జేబీసీల సహాయంతో తొలగించారు.

తుంగతుర్తి: మండల పరిధిలోని రావులపల్లి, మానాపురం, గొట్టిపర్తి గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వడగండ్ల వర్షం కురిసింది. వరిచేలు, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. సుమారు 150 గ్రాముల బరువుతో వడగండ్లు పడటంతో పెంకుటిళ్లుల పైకప్పులు పగిలిపోయాయి. రావులపల్లిలో రోడ్లు మంచుకప్పినట్లుగా కనిపించాయి. తుంగతుర్తి–రావుపల్లి రహదారిపై చెట్టు విరిగి పడటంతో ప్రయాణికుల రాకపోకలకు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



తుంగతుర్తి: రావులపల్లిలో పడిన వడగండ్లు

కూలిన భారీ కటౌట్లు
మేళ్లచెరువు: మండలకేంద్రంలో గతనెల మహా శివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కటౌట్‌లు శనివారం సాయంత్రం వచ్చిన గాలివానకు మెయిన్ రోడ్డు పక్కన కూలి పడిపోయాయి. దీంతో దగ్గరలో పార్కింగ్ చేసిన రెండు బైక్‌లు, ఓ కారు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

నేలవాలిన వరిపైర్లు
హుజూర్‌నగర్ రూరల్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు గోపాలపురం, బూరుగడ్డ, కరక్కాయలగూడెం గ్రామాల్లో కోత దశకు చేరుకున్న వరిచేలు నెలవాలాయి.

దెబ్బతిన్న నిమ్మతోటలు



కనగల్ : నేలరాలిన నిమ్మకాయలు

కనగల్: దర్వేశిపురం గ్రామపంచాయతీ పరిధిలోని మంచినీళ్లబావిలో శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో నిమ్మతోటల్లోని చెట్లు కూకటివేళ్లతో నేలమట్టమయ్యాయి. చాలామంది రైతుల తోటల్లో కాయలు నేలరాలాయి. తోటల్లో రైతులు వేసుకున్న రేకుల షెడ్లు, 10 కరెంట్ స్తంభాలు కూలాయి. వరిచేలు నేలవాలాయి. ఇటుక బట్టీలు నేలకు ఒరిగాయి. మా గ్రామంలోనే ప్రకృతి కన్నెర్రజేసిందని రైతులు వాపోతున్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని గర్కనట్‌తండాలో శనివారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సానికి సఫావత్ మోతీలాల్, సఫావత్ కమలి, బాలోజీల ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయి పూర్తిగా ధ్వంసమయ్యాయి. తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న మంత్రి



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న సినీ నటుడు తనికెళ్ల భరణి, కుటుంబ సభ్యులు



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సినీనటుడు తనికెళ్ల భరణి, బిగ్‌బాస్–6 రన్నరప్ శ్రీహాన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. గర్భాలయంలో పూజలు చేశారు. ఏకాదశి కావడంతో ముఖ మండపంలో నిర్వహించిన లక్ష పుష్పార్చన పూజల్లో సైతం పాల్గొన్నారు. మంత్రికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, రైతుబంధు జిల్లా డైరెక్టర్ మిట్ట వెంకటయ్యగౌడ్ స్వాగతం పలికారు.



శ్రీస్వామిని దర్శించుకున్న బిగ్ బాస్–6 రన్నరప్ శ్రీహాన్ తదితరులు

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

చివ్వెంల(సూర్యాపేట): విద్యుదాఘాతానికి గురైన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కుడకుడ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన గిలకత్తుల పూర్ణచందర్, మంజుల తమ ఇద్దరు కుమారుల చదువు నిమిత్తం సూర్యాపేటకు వచ్చి కుడకుడలోని స్నేహనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరి చిన్న కుమారుడు అభిరామ్ (10) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 3 వతరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం ఒంటిపూట బడులు కావడంతో శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన అభిరామ్ మేడపై ఉన్న టీవీ కేబుల్ వైరుతో ఆడుకుంటుండగా ఆ వైరు ఇంటిపై నుంచి వెళ్తున్న 33 కేవీ విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే 70 శాతం కాలి ఉన్న అభిరామ్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంత్యక్రియలు నిమిత్తం బాలున్ని స్వగ్రామం గోరంట్లకు తీసుకెళ్లారు. విద్యుత్ వైర్లు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు..
చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. చిట్యాల ఏఎస్‌ఐ జానారెడ్డి తెలిపిన వివరాలిలా.. వెలిమినేడు గ్రామానికి చెందిన బైకాని అశోక్ (25) గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఉదయం పూట మద్యం సేవించడంతో అతన్ని కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అశోక్ వెంటనే గ్రామ శివారుకు వెళ్లి తాను పురుగుల మందు తాగినట్లు అతని స్నేహితులు, కుటుంబసభ్యులకు వాట్సాప్ కాల్ చేశాడు. దీంతో అక్కడికి వెళ్లిన కుటుంబ సభ్యులు అతన్ని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

IN THE HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD
I.A.No 1 of 2016
(A.S.M.P. 1443 OF 2016)
IN
A.S.S.R No.9212 of 2016

Between:
B Sravan Kumar Reddy and others ...Petitioners/Appellants.
And
Maddi Bhagyamma and others ...Respondents/Respondents

To
Ch. Upender Reddy, S/o. Late. Rami Reddy, Aged about 40 years, R/o. Chittapur Village, Veligonda Mandal, Nalgonda District.
Notice is hereby issued pursuant to the order of the Hon'ble High Court of Telangana at Hyderabad in I.A. No.1 of 2016 (A.S.M.P. No.1443 of 2016) in A.S.S.R. No.9212 of 2016 filed by B.Sravan Kumar Reddy and others against Maddi Bhagyamma and others posted after four weeks for your appearance at 10-30 a.m., on failure to appear before the court the matter will be decided by the Hon'ble Court as per law.

(BY THE ORDER OF THE COURT)
RAMAKRISHNA .K ADVOCATE
PLOT No.73, GA-I, SBH COLONY, SAIDABAD, HYDERABAD.

రీజినల్ రింగ్ రోడ్డు బాధితుడు గుండెపోటుతో మృతి

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డులో భూమి కోల్పోతున్న రైతు గుండెపోటుతో మృతిచెందాడు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి గ్రామానికి చెందిన రైతు సాధమైన యాదగిరి(75)కి గ్రామంలో 2.27 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమి రీజినల్ రింగ్ రోడ్డులో పూర్తిగా కోల్పోతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా యాదగిరి మనోవేదనతో ఉంటున్నాడు. ఈ దశలో శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. మృతునికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వంశపారంపర్యంగా వచ్చిన భూమిలో వ్యవసాయం చేస్తూ కట్టెలుకొట్టి నలుగురు కూతుళ్లు, ఒక కుమారుని వివాహం చేశారు. ఎన్ని కష్టాల వచ్చినా ఉన్న భూమిని కాపాడుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని పలుమార్లు పోరాడాడు.



యాదగిరి (ఫైల్)

150 బస్తాల నల్లబెల్లం పట్టివేత

కోదాడ రూరల్ : ఏపీ రాష్ట్రం చిత్తూరు నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న ఏడున్నర టన్నుల నల్ల బెల్లం డీసీఎం వాహనాన్ని కోదాడ రూరల్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడుకు చెందిన నల్లతంబి కందస్వామి తన సొంత డీసీఎంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీరంగరాజపురం మార్కెట్‌లో 150 బస్తాల నల్లబెల్లం, 10 కేజీల పటికను లోడ్ చేసుకున్నాడు. ఈ బెల్లాన్ని తెలంగాణ మీదుగా మహారాష్ట్రలోని లాతూర్ మార్కెట్‌కు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 35 ఆవులను కూడా పట్టుకున్నారు. ఈ కేసుల్లో రెండు వాహనాలను సీజ్‌చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



పట్టుబడిన డీసీఎం

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- మృతుల్లో ఒకరు నెల్లూరుకు చెందిన యువతి
- కేతేపల్లి, మర్రిగూడ, నాగారం మండలాల పరిధిలో ఘటనలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో శుక్రవారం రాత్రి, శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మణించగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనలు కేతేపల్లి, మర్రిగూడ, నాగారం మండలాల పరిధిలో చోటు చేసుకున్నాయి.

కేతేపల్లి: తెల్లవారితే ఆ యువతి అమెరికాకు పయనం కావాలి.. బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా ఆమెను మృత్యు వెంటాడింది. గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో యువతి మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కేతేపల్లి మండలం చీకటిగూడెం వద్ద 65 నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగింది. పోలీసులు తెలిపన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ రాష్ట్రం నెల్లూరు జిల్లాకు చెందిన కరుణం ప్రీతి (21) తమ బంధువులతో కలిసి అమెరికాలో ఉంటూ విద్యనభ్యసిస్తోంది. ప్రీతి ఆమె బంధువులతో కలిసి ఇటీవలహైదరాబాద్‌కు వచ్చింది. విజయవాడలో తమ బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు ప్రీతి హైదరాబాద్ నుంచి బంధువులతో కలిసి ఈనెల 16న కారులో విజయవాడకు వెళ్లారు. నిర్ణీత తేది ప్రకారం ఆదివారం ఉదయం ప్రీతి హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లాల్సి ఉంది. దీంతో శనివారం కారులో హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో కేతేపల్లి మండల పరిధిలోని చీకటిగూడెం వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ప్రీతి ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డుపై పల్టీ కొట్టి అడ్డంగా పడింది. దీంతో హైవే ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వాహనంలో ఉన్న వారిని బయటుకు తీశారు. క్రేన్ సహాయంతో కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ప్రీతి తలకు బలమైన దెబ్బలు తగిలి అక్కడిక్కడి మృతి చెందింది. కారులో ఉన్న ప్రీతి చిన్నమ్మ చేకూరి సరిత చేతికి బలమైన గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రీతి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.



కేతేపల్లి: హైవేపై పల్టీ కొట్టిన కారు





మృతి చెందిన సుంచు నర్సింహ, ముత్తయ్య

బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మరొకరు
మర్రిగూడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యరగండ్లపల్లికి చెందిన వల్లెంల ముత్తయ్య(50) తన భార్య ముత్తమ్మను తీసుకొని బైక్‌పై గ్రామం నుంచి మర్రిగూడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొత్త శివ, ఎడ్ల రాజులు బైక్‌పై నిర్లక్ష్యంగా అతివేగంగా మర్రిగూడ నుంచి యరగండ్లపల్లికి వెళ్తుండగా పురేనాగుట్ట మూలమలుపు వద్ద ముత్తయ్య బైక్‌ను ఎదురుగా వచ్చి బలంగా ఢీకొనడంతో ముత్తయ్య, ముత్తమ్మ, శివలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మాల్ పీపుల్స్ ఆస్పత్రికి తరలించారు. ముత్తయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరో వ్యక్తి..
నాగారం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫణిగిరిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన సుంచు నర్సింహ (32) వృత్తిరీత్యా లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనిపై తన అత్తగారి ఊరైన తుంగతుర్తికి బైక్‌పై వెళుతుండగా మార్గమధ్యంలో ఫణిగిరి శివారులోని బంధం మైసమ్మ గుడి వద్ద బైక్ అదుపు తప్పడంతో పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలైన నర్సింహ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఆరునెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

కోళ్లు చనిపోయిన ఘటనపై కేసు

మోటకొండూర్: నాటు కోళ్లు చనిపోయిన ఘటనపై మోటకొండూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన కోల చంద్రమౌళి తన ఫామ్‌లో పెంచుతున్న కోళ్లకు గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం పెస్టిసైడ్స్ పిచికారీ చేయటంతో సుమారు 70 కోళ్లు చనిపోయాయి. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, నల్గొండ.
OS No. 216/2020
Between:
మశ్కెన యిన్నయ్య and మరియొకరు ....Plaintiffs
and
మశ్కెన జోజయ్య and అదర్స్ ....Defendants

నోటీసు
డి 2) Fr. కొంక జోసెఫ్, తండ్రి: అంతయ్య, వయస్సు: 46 సం॥, వృత్తి: చర్చి పాస్టర్, నివాసం: 6-198/1, మునుగోడు గ్రామం & మండలం, నల్గొండ జిల్లా.
డి 7) కొంక మేరి, భర్త : బల్లా కిరణ్‌కుమార్, వయస్సు : 34 సం॥లు, వృత్తి : ఎంప్లాయీ, నివాసం : 7-27/1, భీమవరం గ్రామం, కేతేపల్లి మం॥, నల్గొండ జిల్లా.
పైన తెలిపిన Plaintiffs, Defendants No. 1, 2 మరియు 7 అయిన మీపైన, పైన తెలిపిన కోర్టులో పార్టీషన్ దావా వేసియున్నారు. అట్టి దావా ది. 17-04-2023న వాయిదా కలదు. కావున ఆరోజున మీరు స్వయంగా కానీ లేదా మీ తరుపు న్యాయవాది ద్వారాగానీ జవాబు చెప్పుకొనుటకు పైన తెలిపిన కోర్టునందు ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరు కాగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్పు వెలువరించెదరని తెలియజేయడమైనది.

//కోర్టువారి అనుమతితో//
సం/-
యం. విజయ్ భాస్కర్
వి. సంపత్ కుమార్
అడ్వకేట్స్, నల్గొండ
సెల్: 9440728309